

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జూన్ 28, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం సాయంత్రానికి 204క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 32.910టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్సికి 700 , ఎన్ఎఫ్సికి 425 , పెన్నా డెల్టాకు 2500, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 92.379మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# అన్ని మండలాలలో రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి కావాలి - జాయింట్ కలెక్టర్ కార్తీక్



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 28, ప్రభాతవార్త** జూలై 15 నాటికి అన్ని డివిజన్లలలోని మండలాలలో రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి కావాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ సంబంధిత మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శనివారం నెల్లూరు, ఆత్మకూరు డివిజన్ల రెవెన్యూ అధికారులతో రెవెన్యూ ప్రాధాన్యత అంశాలపై మండలాల వారీగా సమీక్ష సమావేశాన్ని స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదులు కార్యక్రమంలో భాగంగా వచ్చే దరఖాస్తులను సకాలంలో పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. అదే విధంగా ఎన్నిక కాబడిన కొన్ని మండలాలలో భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సాదా బైనామాలను పెండింగ్ లేకుండా చూడాలన్నారు. గ్రామ కంటాన్ని గుర్తించేటప్పుడు క్షుణ్ణంగా పరిశీలించి వెరిఫై చేసుకోవాలన్నారు. పెండింగ్ లేకుండా పనులు. పూర్తి చేయాలన్నారు. 22(ఏ) అడంగల్ అప్లికేషన్లను పెండింగ్లో ఉన్నవి పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ ప్రాధాన్యత అంశాలలో నెల్లూరు జిల్లా ముందంజలో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. రెవిన్యూ ప్రాధాన్యత అంశాలు సకాలంలో పూర్తి చేయాలని నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. హౌసింగ్ ఫర్ ఆల్ దరఖాస్తులను సకాలంలో పంపించాలన్నారు. కౌలు రైతులకు అందించే సి.సి.ఆర్.సి ( క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డ్స్) మంజూరులో వేగాన్ని పెంచి ప్రత్యేక డ్రైవులను నిర్వహించి అర్హత కలిగిన కౌలు రైతులకు సిసిఆర్సి కార్డులు అందే విధంగా విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి వయోవృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ను అందజేయాలన్నారు. రేషన్ సరుకులు పంపిణీలో జాగరుకత వహించి ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. రేషన్ డిస్ట్రిబ్యూషన్ విషయంలో ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కర్, నెల్లూరు, ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు నాగ సంతోష్ అనూష, పావని, ల్యాండ్ రికార్డ్స్ అధికారి నాగ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా సచివాలయ కార్యదర్శిల రేషనలైజేషన్ ఆప్షన్ ప్రక్రియ పూర్తి - కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్,జూన్ 28 ప్రభాతవార్త :** ప్రభుత్వ నిర్దేశాల మేరకు గ్రామ వార్డు సచివాలయ విభాగం చేపట్టిన రేషనలైజేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేసినట్లు నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై ఓ నందన్ తెలియజేశారు. నెల్లూరు నగరపాలక సంస్థతో పాటు, వివిధ మున్సిపాలిటీలకు సంబంధించిన వార్డు సచివాలయ కార్యదర్శుల రేషనలైజేషన్ ప్రక్రియను కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సమావేశము హాల్లో, కార్యాలయం ప్రాంగణం ప్రాంతాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ తో పాటుగా వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు ప్రక్రియను పర్యవేక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ ఆప్షన్ ప్రక్రియను నేడు పూర్తి చేసామని, ఉద్యోగులకు వార్డుల కేటాయింపు ప్రక్రియను ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం ప్రాంగణంలో ఉద్యోగులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించి రేషనలైజేషన్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు

# రోడ్డెక్కిన పొగాకు రైతులు

- లోగ్రేడ్ కొనాలని నిరసన
- గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్
- వేలం పక్రియను నిలిపివేసిన రైతులు
- రోడ్డుపై బైటాయింపు
- సబ్ కలెక్టర్కు వినతిపత్రం అందజేత



**కందుకూరు, జూన్ 28, ప్రభాతవార్త** ఆరుకాలం శ్రమించి కష్టించి పండించిన పొగాకును కొనుగోలుదారుల గుత్తాదిపత్యంతో గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు రోడ్డెక్కి నిరసన తెలిపారు. శనివారం కందుకూరు పట్టణంలోని 27వ వేలం కేంద్రంలో పొగాకు రైతులు లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేయడం లేదని ఆందోళన చేశారు. శనివారం జరిగిన వేలంకు లింగసముద్రం మండలం మాలకొండరాయపాలెం, ఒలేటివారిపాలెం మండలం, కొండసముద్రం గ్రామాల్లో వేలం జరిగింది. ఈ వేళానికి 980 పొగాకు బేళ్లు వచ్చాయి. వేలం ప్రారంభమై 160 బేళ్లు కొనుగోలు కాగా అందులో 80 బేళ్లు కొనుగోలు దారులు కొనడం లేదని బోర్డు నిర్వాహకులు నోబిడ్లు వేశాని రైతులు వేలం పక్రియను నిలుపుదల చేశారు. తదుపరి రోడ్డుపై బైటాయించి నిరసనను తెలియజేశారు. అనంతరం రైతులు ర్యాలీగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజకు వినతిపత్రం అందజేశారు. సరైన గిట్టుబాటు ధరలు కల్పించేంత వరకు కొనుగోలును జరిగించేది లేదని రైతులు బోర్డు అధికారులకు తెలిపారు. వేలం నిలిచిన విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు వేలం కేంద్రానికి చేరుకొని రైతులతో చర్చలు జరిపి నోబిళ్లు లేకుండా కొనుగోలు జరుపుతామని రైతులను శాంతింప చేసి తిరిగి కొనుగోలును ప్రారంభించారు.



# కావలి గడ్డపై స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి జెండా ఎగురవేద్దాం

## కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి





**కావలి రూరల్, జూన్ 28 ప్రభాతవార్త** తెలుగుదేశంపార్టీకి చేసిన సేవలను మెచ్చి కార్యకర్తల కష్టాన్ని చూసి పదవులు ఇచ్చానని, ప్రతి కార్యకర్తకు పదవులు ఉన్నా లేకున్నా టిడిపి పార్టీకోసం శ్రమించి రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో కావలి గడ్డపై టిడిపి జెండాను ఎగురవేద్దామని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కావలి టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తల సమావేశం, కమిటీల ఎంపిక ఎమ్మెల్యే దగుమాటి ఆధ్వర్యంలో పార్టీ అబ్జర్వర్ల సమక్షంలో శనివారం నిర్వహించడం జరిగింది. పట్టణ, మండల అధ్యక్షులను, కార్యదర్శులను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. ప్రతి కార్యకర్త ప్రభుత్వం విడుదల చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలకు అందచేసి పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేస్తారని పదవులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. పదువులు ఉన్నా లేకున్నా అందరికి సముచిత స్థానాన్ని కల్పిస్తానని తెలిపారు. మనందరం కలిసి మనపార్టీ బలోపేతానికి కృషిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేందుకు నేటినుంచే కష్టపడి పనిచేయాలన్నారు. రాష్ట్రముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు 75 సంవత్సరాల వయసులో కూడా మన రాష్ట్రఅభివృద్ధికోసం, రాష్ట్రప్రజలకోసం ఎంతో శ్రమను దానం చేస్తున్నారన్నారు. అలాంటి గొప్ప వ్యక్తికోసం మన జీవితంలో మనం కూడా కొంత సమయం, శ్రమను దానం చేయలేమా అని తెలిపారు. ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు చేసిన శ్రమవల్లే ఎవరికి రాని మెజారిటీ నాకు వచ్చిందన్నారు. ఇంతటి మెజారిటీతో నన్ను గెలిపించిన ప్రతి కార్యకర్తకు రుణపడి ఉన్నానన్నారు. ఎమ్మెల్యే గెలిచిన దగ్గర నుండి కావలిలోనే ఉంటూ ప్రతి నిత్యం ప్రజలకు అందుబాటులో పనిచేస్తూ నావంతు కృషిచేస్తున్నాన న్నారు. నాపై ఎన్ని విమర్శలు చేసినా నా కావలి ప్రజల కోసం, కావలి అభివృద్ధికోసం ఇంకా రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తున్నానన్నారు. పార్టీకోసం కష్టపడే ప్రతి కార్యకర్త గుర్తున్నారని, ప్రతి ఒక్కరినికూడా కాపుకాసుకుంటానని తెలియచేశారు.

**నూతన పట్టణ, మండల కమిటీలు ఎంపిక...**

నూతన పట్టణ, మండల కమిటీలను అబ్జర్వర్లు ప్రకటించడం జరిగింది. కావలి పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతిబాబురావు, కావలి రూరల్ మండల అద్యక్షులు ఆవుల రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకటరావు, అల్లూరు మండల అద్యక్షులు బండి శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి అంబటి రాజేంద్ర, అల్లూరు పట్టణ అద్యక్షులు రామిశెట్టి కృష్ణచైతన్య, ప్రధాన కార్యదర్శి అరగల రమణయ్య, బోగోలు మండల అద్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్బాబు, దగదర్తి మండల అద్యక్షులు అల్లం హనుమంతరావు, ప్రధాన కార్యదర్శి వింజం కొండపనాయుడులు ఎంపిక కావడం జరిగింది. ఎంపికైన వారిని ఎమ్మెల్యే దగుమాటి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు దొడ్డా వెంకట సుబ్బారెడ్డి, చక్కా మదన్కుమార్, కొన్నెబోయిన చెంచుకిషోర్, అధికసంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బుచ్చి నగర పంచాయతీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తా

## - 3 కోట్లతో రోడ్లు,డ్రైన్లు - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి





**బుచ్చి, జూన్ 28, ప్రభాతవార్త** గత ఐదు సంవత్సరాలలో బుచ్చిరెడ్డిపాళెం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం హయాంలో బుచ్చి రెడ్డి పాళెం నగర పంచాయితీని అన్ని విధాలా అభి వృద్ధి చేస్తామని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీలోని 2 వవార్డులో ఆమె పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు.2 వవార్డు మా కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్ చాలా అభివృద్ధి చేసి వున్నారని, ఈ వార్డును మరింత అభివృద్ధి చేస్తానని ఆమె హామి ఇచ్చారు.ఈ సందర్భంగా ఆమె ప్రజలతో మమేకమై చాలా విషయాలు చర్చించారు. మన వూరు అభివృద్ధిలో మన వంతు కూడా ఉండాలని ప్రజలు ఆలోచించాలని ఆమె పేర్కున్నారు. డ్రైనేజిలలో ప్లాస్టిక్ కవర్లు వేయవద్దని ఆమె ప్రజల్ని కోరారు. కొత్తగా ఎన్నికైన తెలుగుదేశం పార్టీ బూత్ లెవల్ మరియు వార్డు కమిటి నాయకు లకు ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. 3 కోట్ల రూపాయలతో బుచ్చిరెడ్డిపాళెం రెడ్డిపాళెం పట్టణంలో పార్టీలకు అతీతంగా మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు.

❖ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా చేసుకొని ముందుకు వెళుతున్నారనిన ఆమె ప్రశంసించారు. ఆగష్టు 15 నుండి మహిళలకు ఆర్టిసి బస్సులలో ఫ్రీగా ప్రయాణం చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ఆమె తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన విధంగా తల్లికి వందనం కూడా వేయడం జరిగిందని తెలిపారు.

❖ నూతన కమీటిలు ఎంపికైన నాయకులు ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమపథకాలు వివరించి,వారి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. బుచ్చి నగర పంచాయితీ చైర్పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, కమీషనర్ బాలకృష్ణా,స్థానిక కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్, జూగుంట పురుషోత్తమ్, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్రెడ్డి, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, టిడిపి అర్బన్ అద్యక్షులు గుత్తా శ్రీనివాసులు, రూరల్ అద్యక్షులు బెజవాడ జగదీష్, సీనియర్నాయకులుఎం.విశేషయ్య,వింజం రామానాయుడు, కౌన్సిలర్ శ్రీదేవి, ఇప్పగుంట సుధాకర్ రెడ్డి, జనసేన మండల పార్టీ అద్యక్షులు మాదవ్, డిప్యూటి తహసిల్దారు బాగ్యలక్ష్మీ,రెవిన్యూ ఇనస్పెక్టర్ శాంతి ప్రియ, పలువురు టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వక్ఫ్ ఆస్తుల పరిరక్షణతో పాటు ఆదాయాన్ని ఆర్జించాలి

## - రాష్ట్ర వక్ఫ్బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త -వైద్యం** వక్ఫ్ ఆస్తులను కాపాడుకోవడం ఎంత ముఖ్యమో ఆయా ఆస్తుల నుండి ఆదాయాన్ని ఆర్జించడం అతే ముఖ్యమని రాష్ట్ర వక్ఫ్బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర వక్ఫ్బోర్డు సమావేశం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్లో నిర్వహించారు. సాధారణంగా బోర్డు సమావేశాలు విజయవాడ కేంద్రంగా నిర్వహిస్తుండగా మొదటి సారిగా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించాలనే నిర్ణయంలో భాగంగా మొదటి సారిగా నెల్లూరులో నిర్వహించారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులైన శాసనమండలి సభ్యులు రహుల్లా, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు నసీర్ అహ్మద్, ఖాజా, అక్రం, ముకర్రం, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, బేపారీ జాకీర్ అహమద్, దావూద్ భాషా బఖావి పాల్గొన్నారు. సమావేశ వివరాలను బోర్డు చైర్మన్ మీడియాకు వివరిస్తూ వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకుంటూనే వాటి ద్వారా ఆదాయం పొందేందుకు మార్గాలు అన్వేషిస్తున్నామన్నారు. ముఖ్యంగా రాష్ట్ర స్థాయిలో రెంట్ రివ్యూ కమిటీని ఏర్పాటు చేసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బోర్డు ప్రత్యేక నిర్వహణలో ఉన్న 1300 షాపుల అద్దెలను పరిశీలిసూత్తున్నామన్నారు. ఇరువైపులా ఎవరికి ఇబ్బంది లేకుండా ఉభయకుశలోపరిగా ఆయా షాపుల వారితో మాట్లాడి ఆదాయాన్ని పెంచేందుకు, తద్వారా పేద ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో వక్ఫ్బోర్డు సమావేశాలు జరపడం ద్వారా ఆయా జిల్లాల్లో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని భావించి నిర్ణయించామన్నారు. గత ప్రభుత్వంలో వక్ఫ్బోర్డు ద్వారా అభివృద్ధి పనులు చేయకపోవడమే కాకుండా కేంద్రం మంజూరు చేసిన రూ.386 కోట్ల నిధులకు యుటిలైజేషన్ సర్టిఫికేట్ పంపకపోవడంతో కేంద్రం కొత్తగా నిధులు మంజూరు చేయడం లేదన్నారు. మైనార్టీల అభివృద్ధికి అడ్డంకిగా మారిన ఈ విషయంలో ముఖ్యమంత్రి స్థాయిలో మాట్లాడి త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అలాగే వక్ఫ్భూములను అమ్మినటువంటి ముతవల్లీలు(ధర్మకర్తలు) పై విచారించి క్రిమినల్ కేసులుప ఎడతామన్నారు. అదే విధంగా గుంటూరు జిల్లా మల్లయపాలెంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేసేందుకు ఏపీఐఐసీ నుండి దరఖాస్తు వచ్చిందని, టైటిల్, ఓనర్ షిప్పు మారకుండా లాంగ్ టర్మ్లో లీజుకు ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు. నెల్లూరు బారా షహీద్ దర్గా అభివృద్ధికి వక్ఫ్బోర్డు తరుపున 1.5 కోట్ల రూపాయలు కేటాయించామని అలాగే కుసుమూరు, ఏఎస్పేట దర్గాలను పెద్ద ఎత్తున అభివృద్ధి చేయబోతున్నామని తెలిపారు. వక్ఫ్బోర్డు డైరక్టర్, శాసనసభ్యులు నసీర్ మాట్లా డూత వక్ఫ్ ఆస్తులను పరిరక్షించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. వాటి ద్వారా ఆదాయాన్ని ఆర్జించి పేద ముస్లింల ఉన్నత చదువు లకు, పెళ్లిళ్లకు ఉపయోగిస్తామన్నారు. వక్ఫ్బోర్డు సమావేశాలు గతంలో సరిగా నిర్వహించలేదని, ముస్లిం మైనార్టీ వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి సైతం ప్రతి మూడు నెలలకు ఒక సారి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. నిరుపేద ముస్లింలకు భరోసా కల్పించే విధంగా పీ-4 కార్యక్రమాన్ని అమలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. వక్ఫ్బోర్డు సీఈఓ షేక్ మహమ్మద్ అలీ, అధికారులు అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# దగదర్తి వియానాశ్రయ పనులు త్వరలో ప్రారంభం : కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి






**కావలిరూరల్, జూన్28 ప్రభాతవార్త** దగదర్తి మండలం దామవరంలోని విమానాశ్రయానికి సంబంధించిన భూసమస్యలు పరిష్కారమై త్వరలోనే విమానాశ్రయ పనులు ప్రారభమవుతాయని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలియచేశారు. కావలి ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అద్యక్షతన కావలి ఆర్డీఓ వంశీకృష్ణలతో కలిసి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి శనివారం రైతులతో సమీక్షాసమావేశం నిర్వహించడం జరిగింది. భూసమస్యలు ఉన్న రైతులతో మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడారు. దామవరంలో సుమారు 700 ఎకరాలు భూసేకరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వం 100 రోజులు పూర్తిచేసుకున్నపుడే 96కోట్ల రూపాయల నిధులను దామవరం ఎయిర్పోర్టు భూసేకరణకు వెచ్చించడం జరిగిందన్నారు. వీటికి సంబంధించి ఇప్పటికే 30 కోట్లరూపాయలు ఆర్డీఓ అకౌంట్లో డిపాజిట్ చేసిఉన్నారని తెలిపారు. ఇప్పుడు మిగులు నిధులను కూడా ఏర్పాటుచేస్తున్నారని తెలిపారు. త్వరలో దామవరం ఎయిర్పోర్టుకు శంకుస్థాపన చేయాలని మన రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయు ఎక్కువగా కృషిచేయడం జరిగిందన్నారు. రాబోయే కొద్ది నెలల్లోనే దామవరం ఎయిర్పోర్టుకు కూడా శంకుస్థాపన చేసేదానికి ఈ సమావేశం సుగమమం చేసిందన్నారు. రాబోయే 2029 ఎన్నికలనాటికి దామవరం ఎయిర్పోర్టులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిగే విధంగా దామవరం ఎయిర్పోర్టు పూర్తిఅవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కావలి నియోజకవర్గం పారిశ్రామిక ప్రగతిలో ముందుకు పోతుందని ఒక పక్క బిపిసిఎల్ ఇండస్ట్రీ, రామాయపట్నం పోర్టు, దామవరం ఎయిర్పోర్టు, జువ్వలదిన్నె ఫిషింగ్హార్బర్, ఇండస్ట్రియల్ పార్కులు తీసుకువచ్చి అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. కావలి నియోజకవర్గం వ్యవసాయం పరంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో అదే విధంగా ఇండస్ట్రియల్ పరంగా కూడా కావలిని అభివృద్ధి చేస్తున్నామన్నా రు. కావలి నియోజకవర్గానికి నేషనల్ హైవే, నేషనల్ రైల్వే, సముద్రయానం ఉండడం కావలి ప్రజల అదృష్టమని ఇండస్ట్రియల్ పరంగా ఎంతో అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం ఉందని తెలియచేశారు. కావలి రైతులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విరిగిన స్తంభం స్థానంలో నూతన స్తంభం ఏర్పాటు



**బిట్రగుంట జూన్ 28 ప్రభాతవార్త:** బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ లోను బేతనియా పేటలోనూ విద్యుత్ ఇనుప స్తంభం శిదిలావస్థకు చేరుకోవాటంతో దాని స్థానం లో సిమెంట్ స్తంభం ఏర్పాటు చేసినట్లు ట్రాన్సకో ఏ ఈ జడరాయి తెలిపారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా మరమ్మత్తుకు గురి అయిన స్తంభాల వివరాలు ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చి సహకరించాలని కోరారు.

## అల్లూరు మండల టిడిపి అధ్యక్షుడిగా : బండి



**అల్లూరు, జూన్ 28 ప్రభాతవార్త:** అల్లూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా బండి శ్రీనివాసులు రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. రెండవసారి టిడిపి మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పించినందుకు కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఎమ్మెల్సీ బీద రవిచంద్రకు బండి శ్రీనివాసులు రెడ్డికృతజ్ఞతలు తెలియజేశారు.మండల ప్రధాన కార్యదర్శిగా అంబటి రాజేంద్ర.అల్లూరు పట్టణ అధ్యక్షులుగా రామిశెట్టి కృష్ణ చైతన్యకు తెలుగుదేశం పార్టీ లో పదవులు కల్పించారు

## మాలకొండ ఆదాయం రూ.9.2లక్షలు



**వలేటివారిపాలెం జూన్ 28, ప్రభాతవార్త :** మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారిని శనివారం స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతోపాటు పలువురు భక్తులు దర్శించు కున్నారు.తద్వారా స్వామివారికి రూ.9,17846ల మేర ఆదాయం సమకూరింది.ఆలయ ప్రధాన అర్చకులు గౌరీ భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజల వలన రూ.5,600లు,కుంకుమార్చన పూజల ద్వారా రూ.18,640లు, వివాహాల నిర్వహణ వలన రూ.1,000లు, తలనీలాలు టిక్కెట్లు వలన రూ.50,700లు,వాహనపూజల వలన రూ.3,940లు, ప్రత్యేకదర్శనం రూ.3,09,100లు, స్థలపురాణం పుస్తకముల అమ్మకం వలన రూ.580లు,రూముల అద్దెలు రూ.31,070లు, కవర్లు అమ్మకం వలన రూ.6,600లు,అన్నదానం నిమిత్తం రూ.2,75,125లు,లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ.2,08,375లు విరాళాలు రూ.7,116లు చొప్పున స్వామి వారికి భక్తులు సమర్పించారు.

## చుండి సచివాలయ ఆకస్మిక తనిఖీ

**వలేటివారిపాలెం జూన్ 28, ప్రభాతవార్త :** మండలంలోని చుండి సచివాలయాన్ని శనివారం స్థానిక ఎంపీడీవో కె.నరేంద్రదేవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.సిబ్బందిహాజరు పట్టీని పరిశీలించారు. సిబ్బంది పనితీరును సచివాలయ సిబ్బంది సుప్రజ,జ్యోత్స్నలను అడిగి తెలుసుకున్నారు.విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బంది పడతారని సూచించారు. అందుబాటులోలేని సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు.సమయపాలన పాటించాలని,అర్జీదారులుతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. అనంతరం ఆయన చౌకడిపోని సందర్శించారు. దివ్యాంగులకు వయోవృద్దులకు నిత్యావసర సరుకులను ఇంటివద్దనే అందించాలని సూచించారు.

## ప్రాథమిక దశ నుంచి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి



**కోవూరు, జూన్28 ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచి పొదుపు చేయడం అనేది ఒక అలవాటుగా చేసుకోవాలని అక్షరాస్యత కేంద్రం కోఆర్డినేటర్ రవిశంకర్ తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం విద్యార్థులకు పొదుపు చేయడం, తదితర అంశాలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులకు ఇచ్చే డబ్బును దుబారా ఖర్చులు చేయకుండా వాటిని పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులకు కెనరా బ్యాంక్‌లో జీరో బ్యాలెన్స్‌తో ఖాతాలు ఏర్పాటు చేయిస్తామని, దీనిని వారు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన ధనాన్ని బ్యాంకులో పొదుపు చేసుకుంటే భవిష్యత్తులో వారికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అదేవిధంగా విద్యార్థులు సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడే విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం సైబర్ మోసాలు రోజురోజుకూ అధికమవుతున్నాయన్నారు. దీని పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా విద్యార్థులు తగు చొరవ తీసుకోవాలన్నారు. కొంత మంది సైబర్ మోసగాళ్లు ఓటీపీ చెప్పడం, మీకు డబ్బులు వేస్తామని వినయాలపై ఎర వేస్తారని, ఇటువంటి వాటి పట్ల మీ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. నారాయణ ఫిజికల్ డైరెక్టర్ సులోచనలు పలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ సునీత, సుమతి, పీఈటీ వెంకటసుబ్బమ్మ, ఉపాధ్యాయులు యూన్సీరాణి తదితరులు ఉన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలి



**కోవూరు, జూన్28 ప్రభాతవార్త :** మండలంలోని గ్రామ పంచాయతీలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులకు ప్రస్తుతం ప్రభుత్వం అదనపు భారం పెడుతుందని, దీని వలన తాము అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందనిపంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం విధులను బాయికాట్ చేస్తూ ఎంపీ డీవో శ్రీహరిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం పంచాయతీలో ఐవీఆర్ఎస్ కాల్స్‌ను ఏర్పాటు చేసిందని, ఏ శాఖకు లేని ఈ ఐవీఆర్ఎస్ కాల్స్ పంచాయతీ శాఖకు ఏర్పాటు చేయడం తాము మానసికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించాలని కోరుతున్నారు. అనంతరం ఎంపీడీవో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్ని పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

## వృద్ధులకు, వికాలాంగులకు ఇంటివద్దకే రేషన్ సరుకులు



**కావలిరూరల్, జూన్28 ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం 65 సంవత్సరాలు నిండిన వృ ద్ధులకు,వికలాంగులకు నిత్యా వసర సరు కులు ఇంటివద్దకే వచ్చి పంపిణి చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు 26వ వార్డు టిడిపి ఇన్‌చార్జి గంగి నేని వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో శనివారం వికలాంగులకు, వృద్ధులకు ఇంటివద్దకే వచ్చి జులై నెల రేషన్ సరుకులను అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి నాయకులు చుండి కౌశిక్, కన్నె బాలకృష్ణ, కాట్రగుంట కొండపనాయుడు, 27వ రేషన్‌షాపు డీలర్ ఇప్పగుంట మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ అనేది స్వచ్ఛంద సేవా సంస్థ ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

**నెల్లూరు సిటీ, జూన్ 28, ప్రభాతవార్త :** రోటరీ క్లబ్ అనేది స్వచ్ఛంద సేవా సంస్థని పేద ప్రజలకు సేవ చేయడమే ముఖ్య లక్ష్మమని డిస్టిక్ గవర్నర్ నామిని పి కేశవరెడ్డి, రెడ్ క్రాస్ చైర్మన్ వాకాటి విజయ్ కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం నెల్లూరు జిల్లా రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా ప్రస్తుత అధ్యక్షుడు నరేష్ చంద్రారెడ్డి, సెక్రటరీ పి. అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాదిలో జరిగిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా శ్వేతా రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి చేతుల మీదగా నెల్లూరులోని వివిధ పాఠశాలలోని ప్రతిభావంతులైన విద్యార్థిని విద్యార్థులకు ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం నగదు బహుమతులను రోటరీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మధుసూదన్ రావు అందజేశారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బెస్ట్ ఆర్టీసీ డ్రైవర్‌గా వై కృష్ణయ్యకు పురస్కార బహుమతిని అందజేశారు. నూతన కార్యవర్గం ఎన్నిక నెల్లూరు జిల్లా రోటరీ క్లబ్ 2025 - 2026 సంవత్సరానికి రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా తాటిపర్తి ఉదయ భాస్కరరావు, కార్యదర్శిగా కొండపల్లి రవీంద్రనాథ్ ఎంపికయ్యారు, వారితో పాటు మిగతా సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సింహపురి, కోస్టల్ జోన్ క్లబ్ సభ్యులు, రాఘవేంద్ర శెట్టి, శరత్ కుమార్ రెడ్డి, విశ్వేశ్వరరావు, విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## శని చక్రవర్తికి ప్రత్యేక పూజలు

**విడవలూరు, జూన్ 28, ప్రభాతవార్త:** ముదివర్తి గ్రామం పెన్నా నది తీరమున వెలసియున్న శని చక్రవర్తికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకం అర్చనలు, రాహు కేతువులకు వివిధ రకాల పూజలు చేశారు. పరిసర ప్రాంతాల నుండి ప్రజలు వందల సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు పరమేశ్వర్ రెడ్డి, అర్చకులు, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛంద అదనపు లోడ్ క్రమబద్ధీకరణ గడువు 30 వరకే



**కోవూరు, జూన్28 ప్రభాతవార్త :** కోవూరు విద్యుత్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని అదనపు లోడ్‌ను సరైన విధంగా క్రమబద్ధీకరించేందుకు ఏపీఎస్పీ డీసీఎల్ స్వచ్ఛంద అదనపు లోడ్ క్రమబద్ధీకరణ పథకాన్ని ప్రవేశపెట్టిందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె. రమేష్ చౌదరి అన్నారు. కోవూరులోని నేతాజీనగర్‌లో ఉన్న ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయంలో శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని డీఈలు, ఏఈలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా విద్యుత్ వినియోగదారులు తమ అదనపు లోడ్‌ను 50 శాతం డెవలప్‌మెంట్ ఛార్జీల రాయితీతో క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ఈ అవకాశం ఈ నెల 30వ తేది వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని, దీనిని వారు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. అదనపు లోడ్ ఉన్నవారు ఏపీఎస్పీడీసీఎల్ వైబ్‌సైట్‌లో వారి యొక్క అదనపులోడ్ నమోదు చేసుకుని రానున్న రోజుల్లో దీని పట్ల ఎటువంటి సమస్యలు రాకుండా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా పీఎం సూర్యఘర్ పథకంపై వినియోగదారులు మరింత అవగాహన చేసుకుని సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇందుకు ప్రభుత్వం కూడా సబ్సిడీ నిధులు అందజేస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఈ పథకాలపై డివిజన్ పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ పథకాలపై ఏమైనా సమాచారం కావాలంటే వినియోగదారులు ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

## మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాన్ని విజయవంతం చేయాలి



**కోవూరు, జూన్28 ప్రభాతవార్త : కోవూరులోని** జేబీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్ఎంసీ పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శ్రీహరి మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో సదుద్దేశంతో జులై నెల 5వ తేదిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాన్ని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. ఈ సమావేశాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేందుకు పలు కమిటీలు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో హాజరయ్యే తల్లిదండ్రులకు ప్రత్యేకంగా ఆటపాటలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా తిథి భోజనంపై తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎంసీ పేరెంట్స్ కమిటీ కార్యవర్గం పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రిపై విష ప్రచారం

– తప్పుడు కేసులు పెట్టడం భాధాకరం



**కోవూరు, జూన్28 ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఇటీవల పల్నాడు జిల్లా పర్యటనలో జరిగిన విషాద ఘటన మరోసారి రాష్ట్ర ప్రభుత్వం యొక్క భద్రతా యంత్రాంగం వైఫల్యంను తెలియజేసిందని కోవూరు వైసీపీ లీగల్ సెల్ నేతలు పేర్కొన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జెడ్ ప్లస్ భద్రత కలిగిన నాయకుడి వాహనం కింద సింగయ్య అనే పార్టీ కార్యకర్త మృతిచెందిన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కలకలం రేగించిందన్నారు. ఈ ప్రమాదానికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉందన్నారు. కేవలం జెడ్ ప్లస్ కేటగిరి ఉన్న నాయకులకు ఆశించిన మేర భద్రతా ఏర్పాటు చేయకుండా పోలీసుల నిర్లక్ష్య దోరణి కారణంగా గుర్తు తెలియని వ్యక్తులు ఈ పర్యటనలో పాల్గొన్నారన్నారు. ఒక యువకుడు ఏకంగా వాహనం బాండెట్‌పై ఎక్కడం, పోలీసులు ఎవరూ స్పందించకపోవడం దారుణంగా ఉందన్నారు. వాస్తవంగా ఒక వాహనం కింద ఎవరైనా పడి మృతిచెందితే అందుకు కేవలం డ్రైవర్‌ను మాత్రమే బాధ్యులను చేస్తారే తప్ప అందులో ప్రయాణించే ప్రయాణికులపై కేసు పెట్టరన్నారు. అయితే ఈ విషయంలో ప్రభుత్వం డ్రైవర్‌తో పాటు ఆ వాహనంలో ప్రయాణిస్తున్న మాజీ ముఖ్యమంత్రి, ఇతర మాజీ మంత్రులను దోషులుగా చేయడం ఎంతవరకు సబబన్నారు. ఈ కేసులు పెట్టడం పూర్తిగా రాజకీయ దురుద్దేశమే తప్ప వేరేది లేదన్నారు. సోషల్ మీడియాలో టీడీపీ ఆధారిత ఖాతాల ద్వారా అవాస్తవ దృశ్యాలు ప్రచారం చేయడం బాధాకరమన్నారు. ఇది కేవలం ప్రజల్లో ఎదుగుతున్న నాయకుడిని లక్ష్యంగా చేసుకుని జరిగిన ఒక పెద్ద కుట్రే అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు అనూప్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని, జులై 3వ తేది నెల్లూరుకు విచ్చేయనున్న మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో జగన్‌మోహన్‌రెడ్డికి జెడ్ ప్లస్ కేటగిరి భద్రతను తొలగించాలని సంకేతకాలు వస్తున్న నేపథ్యంలో ఆయనకు లక్షలాది మంది ప్రజలు స్వయంగా రక్షణగా నిలుస్తారన్నారు. వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి మాట్లాడుతూ కేవలం జగన్‌మోహన్‌రెడ్డిని జైలులో పెట్టాలన్న రాజకీయ దురుద్దేశంతోనే ప్రభుత్వం ఇటువంటి తప్పుడు కేసులు పెడుతుందని, ఇటువంటి కేసులకు బెదిరే ప్రసక్తే లేదన్నారు. ప్రభుత్వం అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, నేటికీ ఆశించిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఇప్పటికే చాలామందికి తల్లికి వందనం పడలేదని, అటువంటి వాటిని అందించేలా ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. లీగల్ సెల్ నేతలు శ్యామాచార్యులు, బి. చెంచురెడ్డి, సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు ఆదినారాయణరెడ్డి, గోపిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మధురెడ్డి, ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, జూన్28 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో శనివారం ప్రాత:కాలమునే స్వామివారికి అభిషేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ దేవస్థాన చైర్మన్ వెంకటేశ్వర్లు, భక్తులు ఉన్నారు.

## రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉంది



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 28, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో 32,4018 హెక్టార్లలో వరి పంట వేయడం జరిగిందని వ్యవసాయ శాఖ జాయింట్ డైరక్టర్ సత్యవాణి తెలిపారు. ఈ సీజన్లో ఇప్పటి వరకు 7 లక్షల 35 వేల బస్తాల యూరియాను రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఇంకను ఈనెలకు సంబంధించి ఒక లక్షా ఐదు వేల బస్తాల యూరియా అందుబాటులోకి వస్తుందని రైతులు యూరియా కొరకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు. ఇప్పటి వరకు మార్క్‌ఫెడ్ ద్వారా పీఏసీఎస్‌లకు 7,871 మెట్రిక్ టన్నుల యూరియాను, రైతు సేవా కేంద్రాల ద్వారా 2,287 మెట్రిక్ టన్నుల యూరియాను మొత్తంగా కలిపి 10,159 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేయడం జరిగిందన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా వరి పంటను అధికంగా వేసి మండలాలు కలిగిన నియోజకవర్గాల వారీగా సరఫరా చేసిన యూరియా వివరాలు ఆమె తెలిపారు. కోవూరు 101822 బస్తాలు, నెల్లూరు 33,222 బస్తాలు, కావలి 30,022 బస్తాలు, సర్వేపల్లి 27,000 బస్తాలు, ఆత్మకూరు 22,500 బస్తాలు, ఉదయగిరి 6500 బస్తాలు, కందుకూరు 2500 బస్తాలు, వెంకటగిరి పరిధిలోని నెల్లూరు మూడు మండలాలకు 2400 బస్తాలు యూరియా సరఫరా చేయడం జరిగిందని తెలిపారు. యూరియా లేదని యూరియా దొరకదని రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

## సమిష్టి కృషితో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం



**కోవూరు, జూన్28 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలను మరింత బలోపేతం చేసేలా సమిష్టి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానో పా ధ్యా యులు, ఎంఈవోలు, సీఆర్ఎం టీలు సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు కలిగిన పిల్లలు బడిలో ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఆశయమన్నారు. ఆదిశగా గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి విద్యాశాఖలో ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యాకానుక, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశ్యాలపై తల్లిదండ్రులలో అవగాహన కల్పించి విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేలా సీఆర్ఎంటీలు తగు చొరవ తీసుకోవాలన్నారు. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ముందంజలో ఉండాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. ఆ దిశగా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఈవో రహీమ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ పూర్తి చేసుకున్న విద్యార్థులు 1వ తరగతిలో ప్రాథమిక పాఠశాలలో చేర్పించేలా చూడాలన్నారు. బడి కలగిన పిల్లలందరూ బడిలో ఉండాలే తప్ప వారు డ్రాప్ అవుట్స్‌గానూ , బాల కార్మికులుగా గానీ ఉండరాదన్నారు. ఆదివారం సెలవు దినం అయినా సీఆర్ఎంటీలు ప్రత్యేకంగా చొరవ తీసుకుని యూనిఫామ్‌లు, షూస్ మిగిలి ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు పంపేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రధానోపాధ్యాయులు కూడా ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఆదివారం సీఆర్ఎంటీల ద్వారా వచ్చిన మెటీరియల్ తీసుకుని వాటిని సోమవారం విద్యార్థులకు అందజేయాలన్నారు. జులై 5వ తేది నిర్వహించే మెగా పేరెంట్స్ , టీచర్స్ మీటింగ్‌కు ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ప్రభుత్వం ఇచ్చిన నూతన యూనిఫామ్ వేసుకుని వచ్చేలా ప్రధానోపాధ్యాయులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ మాట్లాడుతూ ఇపనపటికే ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు అందజేయడం జరిగిందని, ప్రస్తుతం యూనిఫామ్స్, షూస్ కూడా సగానికి పైగా పాఠశాలలకు అందజేయడం జరిగిందని, మిగిలిన పాఠశాలలకు ఆదివారం లోగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

## 6వ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



**తోటపల్లిగూడూరు, జూన్ 28, ప్రభాతవార్త :** తోటపల్లిగూడూరు మండలం నరకూరు సెంటర్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నరుకూరు సీఐటీయు ఆఫీసు నందు ప్రెస్ మిట్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మారబోయిన రాజా నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాశిన పరశురామయ్య, ఏ.గోపి ట్రెజరర్ శివలు పాల్గొని మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాలెం టౌన్‌లో జులై 1న ఆటో జిల్లా మహాసభలు జరుగుతున్నాయని, ఈ సభలకు నెల్లూరు జిల్లాలోని అన్ని మండలాల, సిటీ, రూరల్ ఆటో స్టాండ్ల నాయకత్వం పాల్గొని మహాసభలు జయప్రదం చేయాలని ఉదయం 9గంటలకు బుచ్చిరెడ్డిపాలెం ఆర్టీసీ బస్టాండ్ వద్ద నుండి ఆటో ర్యాలీ ప్రారంభమై బుచ్చిటౌన్‌లో ఈ ర్యాలీ కొనసాగి అంబేద్కర్ భవనం వరకు చేరుకుంటుందని అనంతరం మహాసభ ప్రారంభమవుతుందని తెలియజేశారు. ఈ మహాసభకు ముఖ్య అతిధులుగా మోర్ల సుప్రజ(ఛైర్ పర్సన్ బుచ్చిరెడ్డిపాలెం సంగం పంచాయతీ) ఎం.శ్రీనివాసులురెడ్డి( సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరెడ్డిపాలెం), కామ్రేడ్ ముజ్‌ఫర్ అహ్మద్(ఏపీ ఆటో అండ్ ట్రాలి ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి), కామ్రేడ్ కే.అజయ్‌కుమార్(సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి), కామ్రేడ్ వివి ప్రసాద్(సీఐటీయు జిల్లా అధ్యక్షులు), కామ్రేడ్ కే.సురేష్ ఆటో కార్మిక సంఘం జిల్లా, కామ్రేడ్ ఎంవీ రాజా, ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పాల్గొంటారని పై మహాసభకు ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## టీడీపీ సంస్థాగత అధ్యక్షులు ఏకగ్రీవ ఎన్నిక




**కందుకూరు, జూన్ 28, ప్రభాతవార్త** శనివారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సంస్థాగత కమిటీల ఏర్పాటు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి పరిశీలకులుగా కుసుమ కుమారి మోపాడు రిజర్వాయర్ చైర్మన్ పరిశీలకులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కోసం, నా గెలుపు కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని అన్నారు. పార్టీలో క్రియాశీలకంగా బాధ్యతలు పోషిస్తూ ప్రతిపక్షంలో ఆటుపోట్లు ఎదుర్కొన్న వారికి పదవులు వాటంతట అవే వస్తాయని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడ్డ అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తామని, పార్టీ నాయకులకు, కార్యకర్తలు అందరూ కలిసి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. లింగసముద్రం మండల అధ్యక్షులుగా సామాజిక సమీకరణలో భాగంగా ఎస్సీ వర్గానికి చెందిన నాయకులు వారికి అవకాశం ఇస్తున్నట్లు తెలియజేశారు. లింగసముద్రం మండల తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షుడిగా కొంత మంది పోటీపడగా పూరిమెట్ల గురునాధంను మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్ణయంతో అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అలాగే కందుకూరు పట్టణ పార్టీ నుంచి గత అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావును కొనసాగించాలని పట్టణ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆమోదించారు. కందుకూరు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలుగా కల్లూరి శైలజాను, పట్టణ మహిళా అధ్యక్షురాలుగా ముచ్చు లక్ష్మీ రాజ్యంను నియోజకవర్గ మహిళ పార్టీనేతలు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పూరిమెట్ల గురునాథం, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు కల్లూరు శైలజ, పట్టణ మహిళ అధ్యక్షురాలు, ముచ్చు లక్ష్మీ రాజ్యంను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కమిటీల ఎన్నిక పరిశీలకులకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ సంస్థాగత నిర్మాణం, పార్టీ కమిటీలు ఒక పద్ధతి ప్రకారం అందరూ నిర్ణయం మేరకు మాత్రమే జరుగుతాయని కమిటీల పరిశీలకులు తెలిపారు.

## ఘనంగా మహాలక్ష్మీ అమ్మవారి గ్రామోత్సవం



**తోటపల్లిగూడూరు, జూన్ 28, ప్రభాతవార్త** తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు గ్రామంలో శ్రీశ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి వార్ల తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా జరుగుతు న్నాయి. అందులో భాగంగా కోడూరు పంచాయతీలోని కోడూరు గ్రామ హరిజన వాడలో ఈనెల 26వ తేదీ నుంచి శ్రీశ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి వార్ల తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం 9.30గంటల నుండి శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు మహానైవేద్యం తీర్థ ప్రసాదములు సమర్పించడం జరిగింది. సాయంత్రం 6గం టల నుండి శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి సలిపిండి, పానకాలు ఇవ్వ డం జరిగింది. రాత్రి 12గంటల నుండి మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూల అలంకరణ చేసి గ్రామోత్సవం చేయడం జరిగింది. ఈ గ్రామోత్సవంలో మంగళవాయిద్యాలు తప్పెట్లు తాళాలు కీలుగుర్రాలు అలాగే కోలా టాలు నడుమ అశ్వ వాహనములపై అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం గ్రామ పెద్ద లు కమిటీ మెంబర్లు అందరూ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా దగ్గరుండి నిర్వహించారు. గ్రామస్తులు, మహిళలు, చిన్న పిల్లలు అందరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు.

## విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై స్పెషల్ డ్రైవ్



ఉదయగిరి, జూన్ 28, ప్రభాతవార్త మండల పరిధిలోని ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌పై ఎంపీడీఓ అప్పాజీ, ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు అధ్యక్షతన శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష కార్యక్రమం జరిగింది. మండలంలో 9 పాఠశాలలో 1వ తరగతి ఎన్‌రోల్‌మెంట్ జరగాల్సి ఉందని తెలిపారు. ఇప్పటి వరకు 6వ తరగతిలో కొత్తగా ప్రభుత్వ పాఠశాలలో 281 మంది విద్యార్థులు చేరడం శుభ పరిణామం అన్నారు.

## ఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ



ఉదయగిరి, జూన్ 28, ప్రభాతవార్త ఎస్సీ కార్పొరేషన్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ ద్వారా ప్రధానమంత్రి అనుశ్చిత్ జాతి అభ్యుదయ యువజన పథకం కింద షెడ్యూల్ కులాలకు చెందిన యువతకు ఉచిత డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ కోర్సు శిక్షణ కొరకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు స్పోక్స్ పర్సన్ లక్కినేని ప్రకాష్ ఒక ప్రకటనలో కోరారు. టెన్త్ ఇంటర్ చదివిన ఎస్సీ అభ్యర్థులు ఉదయగిరిలోని కరెంటు ఆఫీసు సమీపంలోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9177327797 నెంబరును సంప్రదించాలని కోరారు.

## మెప్మా ఆర్పిలకు ట్యాబ్‌లు పంపిణీ

**బుచ్చి జూన్ 28 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డి పాళెం నగర పంచాయితీలోని మెప్మా ఆర్పీలు ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్ళాలని సూచించారు మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడుతు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు సద్వినియోగం చేసుకో వాలని అన్నారు. పొదుపు సంఘాల గ్రూపు లలోని మహిళలకు బ్యాంకు రుణాలను సకాలంలో



అందించాలని చెప్పారు. పొదుపు మహిళలు పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మెప్మా ఆర్పీలు పూర్తి స్దాయిలో కృషి చేయాలని అన్నారు. మహిళలు స్వయం శక్తితో ఎదిగి ఆర్దికంగా బలపడాలని ఆమె ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, స్దానిక కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్, వైస్ ఛైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, కమీషనర్ బాలకృష్ణా, మెప్మా సిఎం అంకయ్య, సిఒ నర్మద, మోప్మా ఆర్పీలు,తదితరులు పాల్గోన్నారు.

## ఎన్‌సిసి విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు

**కావలిరూరల్, జూన్28 ప్రభాతవార్త :** కావలి పాతవూరులోని పురపాలకసంఘం ఉన్నత పాఠశాలనందు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి ఆధ్వర్యంలో శనివారం 75 మంది ఎన్‌సిసి విద్యార్థులకు ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రక్తగ్రూపుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. భవిష్యత్తులో రక్తదానంపై అవగాహన కల్పించుకుని రక్తదాతలుగా మారాలని తెలిపారు. దేశానికి సేవచేసే ధృక్పథం కలిగి ఉండాలని తెలిపారు. ఎన్‌సిసి అధికారి మస్తాన్‌వలి మాట్లాడారు. ఎన్‌సిసి క్యాండెట్స్‌కు ఉచిత రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన రెడ్‌క్రాస్‌కు దన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టెక్నీషియన్స్ పద్మావతి, శేషమ్మ, ఎన్‌సిసి సహాయకులు వెంకటేశ్వర్లు, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.




## జులై 9వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయండి: సిఐటియు



**కావలిరూరల్, జూన్ 28 ప్రభాతవార్త :** కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జులై 9వ తేదీన జరుగు దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు ఆ సంఘం గౌరవ అద్యక్షులు పసుపులేటి పెంచలయ్య పిలు పునిచ్చారు. కార్మికసం ఘాలు దేశ వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా శనివారం సిఐటియు అను బంధ అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కావలి ప్రాజెక్టు సిడిపిఒ సౌజన్యకు సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగింది. అనంతరం పసుపులేటి పెంచలయ్య మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం కావడంలేదని తెలిపారు. తక్కువ వేతనాలు ఇచ్చి యాప్‌ల ద్వారా పనిభారాన్ని పెంచుతున్నారన్నారు. పనిభారాన్ని తగ్గించాలని తెలిపారు. కనీస వేతనం 26వేల రూపాయలు ఇచ్చి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలని తెలిపారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని పరిష్కరించాలని కోరారు. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఐక్యపోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుభాషిణి, కళావతి, జయంతి, జ్యోతి, ప్రభావతి, వజ్రమ్మ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

## మర్రిపాడు మండల ఎస్సీ సెల్ నాయకుడిగా పోలయ్య



**మర్రిపాడు, జూన్28,పభాతవార్త:** మర్రిపాడు మండల ఎస్సీ సెల్ నాయకుడిగా పి.పోలయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రమైన మర్రిపాడులో రాష్ట్ర దేవాదాయ-ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాల మేరకు మండల పరిశీలకులు మధుసూధన్ సమక్షంలో ఆత్మకూరు ఎఎంసి ఛైర్మెన్ ఆరికట్ల జనార్థన్ నాయుడు అధ్యక్షతన మండల టిడిపి సమావేశాని న్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల ఎస్సీ సెల్ నాయకుడిగా పి.పోలయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ డి.గంగాధర్, ప్రధాన కార్యదర్శి బి.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు హజరత్‌బాబు, సీనియర్ నాయకులు వెంట్రామయ్య,టిడిపి మాజీ అధ్యక్షుడు శాఖమూరి నారాయణ, మాజీఎంపిటిసి సబంక సుబ్బారెడ్డి, భీమవరం సొసైటీ ఛైర్మెన్ చెన్నారెడ్డి , బూదవాడ సొసైటీ ఛైర్మెన్ ఎం.సుబ్బారెడ్డి, టిడిపి నాయకులు, మైనార్టీ నాయకులు, ఎస్సీ,ఎస్టీ నాయకులు పాల్గొన్నారు. పోలయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యుత్ శాఖ అభివృద్ధికి వినియోగదారులు సహకరించాలి



**ఆత్మకూరు,జూన్28ప్రభాతవార్త:** ఆత్మకూరు డివిజనల్ విద్యుత్ శాఖ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని విద్యుత్ శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.భాను నాయక్ కోరారు.శనివారం ఆత్మకూరు డివి జనల్ విద్యుత్ శాఖ కార్యాయంలో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను నూతనంగా బాధ్యతలను స్వీకరించానని , విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వారంరోజులపాటు విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తూ ఆత్మకూరు విద్యుత్ డివిజనల్ కార్యాలయంలో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా భద్రతా నియమాలను వివరించే ఫ్లెక్సీని ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు.రైతులకు వ్యవసాయ ఉపయోగానికి నిరంతరం 9గంటలు విద్యుత్ సరఫరా అందించాలని, అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించాలన్నారు. విద్యుత్ సరఫరాలో ఏవైనా అంతరాయాలు ఉంటే తన దృష్టికి తేవాలన్నారు. విద్యుత్‌ను వినియోగదారులు పొదుపుగా వాడాలని, జాగ్రత్తలు పాటించాలని, విద్యుత్ తీగల కింద చెట్లను పెంచరాదని , పిల్లలను విద్యుత్ పరికరాలకు దూరంగా ఉంచాలని, రానున్న వార్షాకాలం దృష్ట్యా విద్యుత్ స్థంభాలకు దూరంగా ఉండాలని, విద్యుత్ తీగల్లో ఏవైనా మరమ్మత్తులుంటే వెంటనే సరిచేసుకోవాలన్నారు. విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు తమ శాఖ సిబ్బంది పరిశీలిస్తూ పరిష్కరిస్తున్నారని, నిరంతరం వారు శ్రమిస్తున్న తీరును అభినందించారు. విద్యుత్ శాఖ అభివృద్ధికి విద్యుత్ వినియోగదారులు పూర్తిస్థాయిలో తోడ్పాటును అందించాలని భాను నాయక్ కోరారు.ఈకార్యక్రమంలో ఎడిఇ చిన్నస్వామి నాయక్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం

**అనుమసముద్రంపేట, జూన్28,పభాతవార్త:** ఏఎస్‌పేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో స్టాఫ్ నర్స్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదే హాస్పిటల్లో పనిచేస్తున్న ఓ స్టాఫ్ నర్స్, ఆమె భర్త ఇద్దరు కలిసి తమను మానసికంగా , శారీరకంగా ఇబ్బంది పెడుతూ వేధింపులకు గురిచేస్తున్నారంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన స్టాఫ్ నర్స్ దొరసానమ్మ ప్రాణాపాయస్థితిలో ఆత్మకూరు లోని ఓ ఆసుపత్రిలో ఉంది. శనివారం విధినిర్వహణలో మత్తు



మాత్రలు మింగిన స్టాఫ్ నర్స పరిస్థితిని గమనించిన సహచర ఉద్యోగులు హుటాహుటిన ఆత్మకూరులోని ఓప్రవేటు వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం స్టాఫ్ నర్స్ దొరసానమ్మకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈసంఘటన నెల్లూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో తవ్ర కలకలం ఏపుతుంది. ఏఎస్‌పేటలో పనిచేస్తున్న తమ కుమార్తెను ఏడాది కాలంగా స్టాఫ్‌నర్స్ లక్ష్మి ఆమె భర్త నాగేంద్ర పదే పదే బెదిరిస్తూ మానసిక వేదనకు గురిచేస్తున్నారంటూ బాధిత దొరసానమ్మ తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఓ మీడియాలో పనిచేస్తున్న లక్ష్మి భర్త తాము ఏమైనా చేస్తాం తమకు సామాజిక అండ ఉంది అంటూ తమ కుమార్తెను బెదిరిస్తున్నారని అతుచూస్తామని హెచ్చరికలు చేస్తున్నారని దీంతోనే తమ కుమార్తె ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై స్థానిక ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్టాఫ్ నర్స్ దొరసానమ్మతోపాటు హాస్పిటల్లో ఉన్న వైద్యులు ఇతర సిబ్బందిని సైతం లక్ష్మి భర్త నాగేంద్ర కలిసి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. స్టాఫ్ నర్స్ లక్ష్మి ఏడాదిన్నర కాలంగా అందరినీ వేధిస్తోందంటూ గత ఆరునెలల క్రితం హాస్పిటల్‌కి చెందిన 53మంది స్టాఫ్ లిఖితపూర్వకంగా ఉన్నతాధికారులకు ఫజర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఎస్‌పేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సహచర స్టాఫ్ లో నర్సులను, డాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తున్న స్టాఫ్‌నర్స్ లక్ష్మి వ్యవహారంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా అందులో విచారణకు వచ్చిన ఓ అధికారి మొత్తం జిల్లా యంత్రాంగాన్ని తప్పుదారి పట్టించారన్న ఆరోపణలున్నాయి. ఉగ్యోగిపై ఆరోపణలు వచ్చినప్పుడు నిజాయితీగా విచారించాల్సిన ఆ అధికారి సామాజిక వలపక్షంతో వ్యవహరించి ఇబ్బందులు పెడుతున్న స్టాఫ్ నర్స్‌ను రక్షించే ప్రనయత్నాలు చేస్తున్నందువలన ఆమె పూర్తిస్థాయిలో రెచ్చిపోయి చివరకు డాక్టర్లను ఆ శాఖలోని ఉన్నతాధికారులను సైతం బెదిరించే స్థాయికి చేరిందని బాధితులు ఆరోపిస్తున్నారు. తన కూతిరికి ఏంజరిగినా పూర్తి బాధ్యత లక్ష్మి, తన భర్త నాగేంద్రదే నని బాధితురాలి తల్లి ఆవేదన వ్యక్తం చేస్తోంది.

## పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు



**దగదర్తి, జూన్ 28, ప్రభాతవార్త :** దగదర్తి మండలంలో జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రంలో జన విజ్ఞాన వేదిక, యూటీఎఫ్ మండల శాఖల ఆధ్వర్యంలో 2025 మార్చి నెల 10వ తరగతి పరీక్షల్లో మండలంలోని ప్రతి ఉన్నత పాఠశాలలో ప్రథమ ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన టువంటి విద్యార్థినీ, విద్యార్థులకు అభినందన సభ జరిగింది. ఈ సభలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు ఎస్.శంకరయ్య, జనవిజ్ఞాన వేదిక దగదర్తి మండల నాయకులు ఎస్‌కే కరిముల్లా, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి జిల్లా నాయకులు విజయ్ కుమార్ మాదాల రాము పాల్గొన్నారు. ఈ కార్యక్రమం దగదర్తి మండల యూటీఎఫ్ నాయకులు వి.గోపి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్.శంకరయ్య జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి అన్ని రంగాల్లో అభివృద్ధికి తోడ్పడేటటువంటి ప్రభుత్వ విద్యా వ్యవస్థని కాపాడుకోవాల్సిన అవసరం నేటి ప్రజలందరి బాధ్యత అని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దగదర్తి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ అలేఖ్య పాల్గొన్నారు. జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్ర నిర్వాహకులు గోపసాని రమేష్, వంటేరు సుధాకర్, మందా మహేష్, చల్ల మాల్యాద్రి, పెరికల మాల్యాద్రి పాల్గొన్నారు.

## లింగసముద్రం మండల టీడీపీ అధ్యక్షులుగా గురునాథం



**లింగసముద్రం, జూన్ 28, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులుగా పూరిమిట్ల గురునాథం ఎన్నికయ్యారు. శనివారం లింగసముద్రం తెలుగుదేశం పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షులు నాయకులు సమావేశం కందుకూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్ష పదవి కోసం నలుగురు వ్యక్తులు పోటీ పడ్డారు. పోటీ పడిన వ్యక్తులతోనూ, గ్రామ పార్టీ అధ్యక్షులు తోను మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాత టీడీపీ మండల అధ్యక్షులుగా గురునాథంను పార్టీ పరిశీలకులు ప్రకటించారు. మండల కేంద్రమైన లింగసముద్రం పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన గురునాథం మొదటి నుండి తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా ఉంటూ పని చేశారు. ఆయన సతీమణి పూరిమిట్ల ప్రభావతి లింగసముద్రం మండలం జడ్పీటీసీగా కూడా పని చేశారు. అంబేద్కర్ నగర్ నుండి మండల పార్టీ అధ్యక్షులుగా ఎంపికైన గురునాథం రెండో వ్యక్తి. గతంలో మండల టీడీపీ అధ్యక్షులుగా, టీడీపీ సీనియర్ నాయకులు చింతా సదానందం పని చేశారు. ఈ సందర్భంగా గురునాథం మాట్లాడుతూ చిన్న వయసులోనే మండల పార్టీ అధ్యక్షత బాధ్యతలు రావడం అదృష్టంగా భావిస్తున్నాను. తనను పార్టీ అధ్యక్షులుగా ఎంపిక చేసిన కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావుకి, తెలుగుదేశం పార్టీ మండల నాయకులకు గ్రామ పార్టీ అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. అదే విధంగా మండలంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, నాయకులను కార్యకర్తలను కలుపుకొని సమన్వయంతో పని చేస్తానని చెప్పారు.

## జగ్గయ్యపేట మాజీ శాసనసభ్యులు ఉదయభానును మర్యాదపూర్వకంగా కలిసిన వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి

**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త -వైద్యం :** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, జనసేన పార్టీ నేత సామినేని ఉదయభానును వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి శనివారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. మంత్రి నారాయణ నేతృత్వంలో నెల్లూరు నగర నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సామినేనికి వేమిరెడ్డి వివరించారు.

## మహాన్యూస్ ఛానెల్ కార్యాలయంపై దాడి దుర్మార్గమైన చర్య



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త- వైద్యం :** మహాన్యూస్ ఛానెల్ ప్రధాన కార్యాలయంపై బీఆర్‌ఎస్ గుండాలు హైదరాబాద్‌లో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలక ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో ఇలాంటి హింసాత్మక చర్యలకు ఎక్కడా స్థానం ఉండదని అన్నారు. మీడియా చూపించే వార్తలపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే, వాటిని పరిష్కరించడానికి కోర్టులు చట్టాలు ఉన్నాయి అని ఆయన చెప్పారు. ఆ నియమాలను పక్కన పెట్టి హింసను ఆశ్రయించడం అసహ్యాకరం, న్యాయ విరుద్ధం. మహాన్యూస్ ఛానెల్‌పై జరిగిన దాడిని అన్ని ప్రజాస్వామిక శక్తులు ఖండించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఇది మీడియా స్వేచ్ఛపై, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకుని, దోషులను చట్టపరంగా శిక్షించాలన్నారు. దోషులను గుర్తించి, వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని మేము ప్రభుత్వాన్ని కోరుతున్నాం అని చిలక ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.

## నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం

**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త -వైద్యం :** 33/11 కేవీ మహాత్మ గాంధీ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ మరమ్మత్తుల పనుల కారణంగా డికెడబ్ల్యూ కాలేజీ, నీలగిరి సంగం, బట్వడి పాలెం సర్కిల్, ప్రశాంతి నగర్, రూరల్ ఎంఆర్వో ఆఫీస్, జడ్పీ ఆఫీస్, అంబేద్కర్ నగర్, కేవీఆర్ పెట్రోల్ బంక్, బ్రహ్మానందపురం, బారాషాహిద్ దర్గా, కలెక్టర్ బంగ్లా, మున్సిపాలిటీ ఆఫీసు, బషీర్ నగర్, జీవీఆర్ కాలనీ, లేక్ వ్యూ కాలనీ, సుజాతమ్మ కాలనీ, లక్ష్మీ నరసింహపురం పరిసర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని తెలియజేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.శ్రీధర్ తెలియజేశారు.

## మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల నందు సన్మాన కార్యక్రమం



**ఉదయగిరి, జూన్ 28, ప్రభాతవార్త :** మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల ఉదయగిరిలో కళాశాల సందర్శనకై వచ్చిన ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నెల్లూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త, విశ్వవిద్యాలయ విభాగాధిపతి వ్యవసాయ విస్తరణ విభాగం డాక్టర్ మిట్ట చిన్న ఓబయ్య ఈ ప్రాంతానికి చెందిన వారు ఈనెల 30న పదవీ విరమణ చేయుచున్న సందర్భంగా కళాశాల సిబ్బంది వారికి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేస్తూ దుస్యాల్వా, జ్ఞాపకతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్న ఓబయ్య మాట్లాడుతూ నేను వెంకట్రావుపల్లి ఈ ప్రాంతానికి చెందిన వాడినని ఇదే ప్రాంతంలో పదవీ విరమణ చేయటం నాకు చాలా గర్వంగా ఉందని అంతే కాకుండా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 36 సంవత్సరాలు పని చేయటం గర్వంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.రమేష్, డాక్టర్ కిషన్ తేజ, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ క్రాంతి, డాక్టర్ సూర్య కమల ప్రియ, చంద్రబాబు, ధనుంజయ చారి, బోధ నేతర సిబ్బంది జయరావ్, సర్ఫరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది



**ఉదయగిరి, జూన్ 28, ప్రభాతవార్త :** అటవీ రేంజ్ పరిధిలోని వన సంరక్షణ సమితి పర్యవేక్షణలో ఉన్న జామాయిల్ మొక్కలను వీఎస్‌ఎస్ ఛైర్ పర్సన్‌లు క్షేత్ర స్థాయి అటవీ సిబ్బంది కుమ్మక్కై జామాయిల్ నరికి పర్మిట్లు లేకుండానే తరలిస్తున్నారని విమర్శలు గుప్పుమంటున్నాయి. వీరు ఇరువురు మిలాఖత్ అయ్యి పర్మిట్లు తక్కువ తీసుకుని అదనంగా లారీలను తరలించడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని పలువురు వాపోతున్నారు.

## రైలు నుండి జారీ పడి ఒకరు మృతి



**మనుబోలు జూన్ 28 ప్రభాతవార్త :** మనుబోలు రైల్వే స్టేషన్ సమీపంలో 145/33-31 కిలోమీటర్ వద్ద రైలు నుండి జారిపడి ఒకరు మృతి చెందారు. శనివారం మధ్యాహ్నం విజయవాడ నుండి చెన్నై వైపు వెళుతున్న రైలు నుండి గుర్తు తెలియని వ్యక్తి జారి పడి మృతి చెందాడు. మృతుడు వయస్సు సుమారు 30-35 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుడు తెలుపు రంగుపై నలుపు గీతలు గల ఫుల్ హాండ్స్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు.ఎడమ చేతి మీద కృష్ణవంశీ అనే పేరు పచ్చ బొట్టు కలదు. కేసు నమోదు చేసి రైల్వే ఎస్ఐ మాలకొండయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రగ్స్ రహిత సమాజమే మన కర్తవ్యం



**నెల్లూరు సిటీ, జూన్ 28, ప్రభాతవార్త :** సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు శేషం సుదర్శన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శేషం సుదర్శన్ మాట్లాడుతూ జీవితం ఎంతో విలువైనదని మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం లీగల్ సెల్ ఏర్పాటు చేసిందని, ప్రజలకు, యువతకు, విద్యార్థులకు అవగాహన కల్పించేలా మన వంతుగా బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు..చివరికి బానిసగా మార్చుకుంటుదన్నారు. మత్తు పదార్థాలకు బానిసై చివరకు ప్రాణాలు కోల్పోయి ఎంతో మంది తమ కుటుంబాలకు కన్నీళ్లు మిగిలిస్తున్నారని ఆవేదన చేస్తూ డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణంలో మనమందరరం బాధ్యత గల పాత్ర పోషించాలని శేషం సుదర్శన్ ఆకాంక్షించారు.

## నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన లక్ష్యం : ఎమ్మెల్యే

**వింజమూరు, జూన్ 28, ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. వింజమూరులో 30వ తేదీన శ్రీ నేతాజీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించబడుతుందని ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగపరుచుకుని నూతన జీవితాన్ని ప్రారంభించాలన్నారు. ముందుగా బొమ్మరాజు చెరువు వద్ద తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద జాబ్ మేళా నిర్వహిస్తామని తెలుపగా కొన్ని కారణాల వల్ల శ్రీ నేతాజీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. జాబ్ మేళాకు వచ్చే నిరుద్యోగులు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. జాబ్ మేళాలో పలు కంపెనీల మేనేజర్లు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. పదో తరగతి పైబడి చదివిన వారందరికి ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయ న్నారు. వయసు 18 నుండి 39 సంవత్సరాల కలిగిన వారందరికి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు అన్నారు. రిజిస్ట్రేషన్ హెచ్‌టీటీపీఎస్: //ఎన్ఏపీయుఎన్‌వైఏఎం .ఏపీ.జీవోవీ.ఇన్/యూజర్ వెబ్‌సైట్ నందు నిరుద్యో గులు పేరును నమోదు చేసుకోవాలన్నారు. అలాట్మెంట్ ఆర్డర్ తీసుకొని జాబ్ మేళాకు హాజరు కావాల న్నారు. అలాగే నియోజకవర్గంలోని కూటమి నేతలు నిరుద్యోగ యువతీ యువకులకు అవగాహన కల్పించి జాబ్ మేళాకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. మరిన్ని వివరాలకు 9177824585, 9182799405 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## వేపదరువు పార్క్‌కి ఆనం వివేకానందారెడ్డి పేరు : నుడా ఛైర్మన్ కోటంరెడ్డి



**నెల్లూరు ,జూన్ 28 ప్రభాతవార్త:** రాజకీయాలకు అతీతంగా స్వర్గీయ ఎమ్మెల్యే ఆనం వివేకానంద రెడ్డి అందరికీ అభిమాన నాయ కుడని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. నుడా నిధులతో వేప దరువు మెయిన్ రోడ్డు సమీపంలో నిర్మిస్తున్న పార్కుకి ఆయన పేరు పెడుతున్నట్లు కోటంరెడ్డి వెల్లడించారు. పార్క్ లో వాకింగ్ ట్రాక్ తో పాటు వివేకానంద కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.ఈ పార్క్ లో యోగ సెంటర్ తో పాటు డ్రగ్స్ కౌన్సిలింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.మంత్రి నారాయణ సహకారంతో నుడా ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వివరించారు. ఇరగాలమ్మ ఆలయం దగ్గర ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్ ని ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్ తరాల కోసం పనిచేసిన నాయకుల పేర్లను పార్కులకు పెడుతున్నామని వివరించారు. ఆదిత్య నగర్ లో కోట్ల రూపాయల స్థలాన్ని స్వాధీనం చూసుకుని కోటిన్నర నుడా నిధులతో ఎస్పీబీ పార్క్ ను ఏర్పాటు చేశామన్నారు. గతంలో హరిజనవాడల్లో పార్కులు ఉండేవే కావని, నారాయణ మంత్రి అయిన తర్వాత నుడా ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం హరిజనవాడలో సైతం పార్కులు నిర్మిస్తున్నామని తెలిపారు. వేప దరువులో 75 లక్షల రూపాయల వ్యయంతో నుడా ఆధ్వర్యంలో పార్కును నిర్మించనునట్లు పేర్కొన్నారు.ఆ పార్కు ఆనం వివేకానంద రెడ్డి పేరు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వర్ ప్రసాద్ ,తానే మస్తాన్, పసుపులేటి మల్లికార్జున, యలమందారెడ్డి, ఆకుల హనుమంతరావు, సుభాన్ భాష, మోహన్ రావు, పావురాల రమేష్, గౌసియా, తిరుమలేష్, పవన్ సునంద్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు



**కొడవలూరు, జూన్ 28, ప్రభాతవార్త:** మండలంలో ఎవరైనా ఆక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక తహసిల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా మట్టి తరలించినట్లయితే పై అధికారుల ఆదేశాలతో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మండలంలో ఎక్కడైనా మట్టి ఆక్రమణ జరిగితే ప్రజలు గుర్తించి గ్రామ రెవెన్యూ అధికారులకు తెలియపరచండి. తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

## ఈ ఓ పి ఆర్ డి బాధ్యతలు స్వీకరణ



**కొడవలూరు, జూన్ 28, ప్రభాతవార్త:** స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఈ ఓ పి ఆర్ డి గా శనివారం ఎస్.మహేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. ఆమె జలదంకి మండలం నుండి బదిలీపై వచ్చినట్లు స్థానిక ఎంపీడీవో సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా ఈ ఓ పి ఆర్ డి మాట్లాడుతూ మండలంలో సమస్యలను తెలియపరిస్తే వెంటనే సంబంధిత గ్రామాల అధికారులతో తెలియపరచి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## నవచేతన బుక్స్ అందజేత



**దగదర్తి, జూన్ 28, ప్రభాతవార్త :** నవచేతన బుక్స్ అంగన్‌వాడీ టీచర్స్‌కి, పీపీఐ, పీపీ-2 బుక్ 3-6 సంవత్సరాల పిల్లలకు ఇవ్వడమైంది. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ కే.సౌజన్య మాట్లాడుతూ ఈ బుక్ ద్వారా పిల్లల్లో కథలు, పాటలు, ఆటలు, గేయాలు చెప్పిస్తూ నూతనంగా నూతనవి ద్యావిధానాన్ని ప్రవేశపెట్టి అంగన్‌వాడీ స్కూల్‌ని ఎక్కువ మంది పిల్లలు వచ్చేలాగా చేయడమైంది. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జే.వాణి, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## నిరూపయోగంగా చెత్త బుట్టలు



**ఉదయగిరి, జూన్ 28, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని ఉదయగిరిలో ప్రతి ఇంటికి పంపిణీ చేయాల్సిన తడి పొడి చెత్త బుట్టలు పంచాయతీ కార్యాలయ ఆవరణంలోని రైతు సేవ కేంద్రంలో దర్శనమిస్తున్నాయి అధికారులు ప్రతి ఇంటికి రెండు చెత్త బుట్టలు ఇవ్వాల్సి ఉంది, వాటిని పంపిణీ చేయకపోవడంతో గదిలో నిరూపయోగంగా దర్శనమి స్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తబు ట్టలను పంపిణీ చేయాలని పలువురు కోరుతున్నారు.

## అన్నదాత సుఖీభవ అర్హులందరికీ అందేలా చూడాలి



**కోవూరు, జూన్28 ప్రభాతవార్త :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే అన్నదాత సుఖీభవ పథకం నిధులు అర్హత కలిగిన ప్రతి రైతుకు అందాలని సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత అన్నారు. కోవూరులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం కోవూరు మండలానికి సంబంధించిన గ్రామ వ్యవసాయ సహాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ ఏ కారణం చేత రైతులకు రాలేదో ఆ వివరాలను రైతుకు పూర్తిస్థాయిలో వివరించి వారిలో అవగాహన పెంచాలన్నారు. అదేవిధంగా ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయిన నేపథ్యంలో ఈ క్రాప్ బుకింగ్‌ను చేపట్టి అవి సకాలంలో పూర్తిచేసేలా రైతు సేవా కేంద్రంలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా రైతుల్లో సాగు ఖర్చులు తగ్గించి దిగుబడి పెంచుకునేలా వారిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి వీఏఏ వారికి కేటాయించిన విధులు బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ఈ సమీక్షలో మండల వ్యవసాయాధికారిణి టి. రజని, గ్రామ వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

## సర్పంచ్‌ను పరామర్శించిన వైసీపీ నేతలు



**కోవూరు, జూన్28 ప్రభాతవార్త :** కోవూరు మండలం మోడేగుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ వైసీపీ సీనియర్ నాయకులు కె. వెంకటరమణారెడ్డి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు శనివారం మండల పార్టీ అధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి, లీగల్ సెల్ నాయకులు బి. చెంచురెడ్డిలు శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి సర్పంచ్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అయనకు అందుతున్న వైద్య సేవలను గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారి కుమారులు శ్రీధర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డిలతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు.

## కావలి కలుగోళశాంభవి అమ్మవారికి ప్రత్యేక పూజలు




**కావలిరూరల్, జూన్28 ప్రభాతవార్త** కావలి గ్రామదేవత శ్రీ కలుగోళ శాంభవి అమ్మవారిని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి శని వారం దర్శించుకున్నారు. శ్రీ భమరాంబికా సేవాసమితి, కావలి సేవా బృం దంవారి ఆ హ్వా నం మేరకు శ్రీ కలుగోళ శాంభవి అమ్మవారికి సారె సమర్పించే కార్యక్రమంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొనడం జరి గింది. స్థానిక లతా థియేటర్ వద్ద ఉన్న గంగమ్మ తల్లి ఆలయం వద్దనుంచి ఊరేగింపుగా భక్తులు, మ హిళలతో కలిసి ఎమ్మెల్యే అమ్మవారి ప్రతిమను తీసుకుని శ్రీ కలుగోళ శాంభవి అమ్మవారి ఆలయం వరకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యే దగు మాటికి ఘనస్వాగం పలికారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పట్టువస్త్రాలు సమర్పిం చారు. అమ్మవారి ఆశీస్సులు కావలి నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. వాసవి వనిత లెజెండ్స్ సభ్యులు, మహిళలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## బదలీ అయిన టీచర్లకు ఘన సన్మానం



**బుచ్చి జూన్ 28 ప్రభాతవార్త** పట్టణంలోని స్దానిక బెజవాడ బుజ్జమ్మ బాలికల ఉన్నత పాఠశాలలో బదలీపై వెళ్ళిన ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయురాలు సుజాత,పాఠశాల టీచర్ల శాలువాలు కప్పి పూల మాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా వారికి మెమోంటోలు ఇచ్చి బహు మ తులు బహుకరించారు. ఈ పాఠశాలలో పని చేసిన ప్రతి టీచర్ కుటుంబసభ్యులుగా మెలుగుతో దీక్షతో విద్యార్దుల అభ్యున్నతికి కృషి చేశారని ప్రధానోపాధ్యాయురాలు సుజాత ప్రశంసించారు. ఇంత మంటి టీచర్లు బదలీ అవడం బాధగా ఉందని అన్నారు. ఈ సందర్బంగా బదలీ అయిన టీచర్లు మాట్లాడుతు ఈ పాఠ శాలను ఎప్పటికి మరచిపోలేమని అన్నారు. పిల్లలందరు ఉన్నత స్దాయికి వెళ్ళాలని వారు కాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీచర్లు, విద్యార్దులు పాల్గోన్నారు.

## పేదింటి బిడ్డకు నూజివీడులో ట్రిబుల్ ఐటి సీటు



**బుచ్చి జూన్ 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం శ్రీగోపాలకృష్ణయ్య పాఠశాలలో ఎల్‌కేజి నుండి 5 వ తరగతి వరకు తమ పాఠశాలలో చదివినట్లు పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్‌తెలిపారు. 2025 పదో తరగతిలో 570 మార్కులు సాధించిందని పూర్వ విద్యార్ది సాంబ్రాల నిహారికను ఆయన శాలువా కప్పి సన్మానించారు. ప్రతి విద్యార్ది జీవితానికి పునాది ప్రాధమిక విద్య అని అన్నారు. ప్రాధమిక విద్యకు చిరునామా శ్రీగోపాలకృష్ణయ్య పాఠశాల అని ఆయన ప్రశంసించారు. ప్రాధమిక స్దాయిలో విద్యార్దులందరికి మంచి పౌండేషన్ కోర్సు నేర్పుతున్నామని అన్నారు. ప్లేవే పద్దతిలో ( చిన్నారులకు ఆట వస్తువులతో ) నేర్పు తామని తెలిపారు. ఈ సందర్బంగా నిహారిక మాట్లాడుతు ఈ పాఠశాలలో నేను ప్రాధమిక విద్య నేర్చు కున్నాను. శ్రీధర్ సార్ నన్ను ఎంతో ప్రోత్స హించారని ఆ విద్యార్ది తెలిపారు. శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌ని ఎప్పటికి మరచిపోలేనని అన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్ది తల్లి,పాఠశాల ప్రిన్సిపల్ సురేఖ, ఉపా ధ్యాయులు, విద్యార్దులు పాల్గోన్నారు.

## రంగా విగ్రహావిష్కరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**కావలిరూరల్, జూన్28 ప్రభాతవార్త** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా విగ్రహావిష్కరణ పనులను శనివారం కాపునేతలు, రంగా అభిమానులతో కలిసి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పరిశీలించారు. జులై 2వ తేదీన రాష్ట్రభారీ నీటిపా రుదలశాఖామంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖామంత్రి పొంగూరు నారాయణలు ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు ఎమ్మెల్యే దగుమాటి తెలిపారు. చేపట్టవలసిన స్టేజి, ఇతర పనులను ఎమ్మెల్యే పరిశీలించి తగు సూచనలు చేయడం జరిగింది.

## కావలిలో డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటి స్పెషల్ డ్రైవ్



**కావలిరూరల్, జూన్28 ప్రభాతవార్త** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాను బాల కార్మిక రహితజిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశాలమేరకు నెల్లూరుజిల్లా కార్మికశాఖ డిప్యూటి కమీషనర్ సూచనలతో సిఎసిఎల్ (క్యాంపెయినింగ్ ఎగైనెస్ట్ ఛైల్డ్ లేబర్) జిల్లా కన్వీనర్ అబ్దుల్ అలీమ్ ఆధ్వర్యంలో శనివారం డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటి కావలి, జలదంకిలోని పలు దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది. ఈ తనిఖీలలో భాగంగా వారు దుకాణాల యజమానులతో మాట్లాడారు. చిన్నపిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమని, ఎక్కడైనా పిల్లలు పనిచేస్తున్నట్లు కనిపిస్తే ఆ షాపు యజమానిపై కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. కేసు నమోదు అయితే, చట్టపరమైన చర్యలను ఎదుర్కొనవలసిఉంటుందని తెలిపారు. ఈ తనిఖీలలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటి సభ్యులు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌లు పి.అనిల్‌కుమార్, ఐ.వెంకటేశ్వర్లు, ఎఎస్ఐ డి.సతీష్, సిజెడబ్ల్యుఎస్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.శుభకిరణ్, ప్రియదర్శిని మహిళామండలి అద్యక్షురాలు షేక్.ఖాదర్‌బిలు పాల్గొన్నారు.

## భక్తులకు సేవచేయడమే ప్రధాన ధ్యేయంగా పనిచేయాలి:ఎమ్మెల్యే



**వలేటివారిపాలెం జూన్ 26, ప్రభాతవార్త** మాలకొండ భక్తులకు మెరుగైన సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని స్దానిక ఎమ్మెల్యే మాలకొండ ఉద్యోగులకు సూచించారు.ఇందులో ఏఒక్కరికీ మిన హాయింపు లేదని వివరించారు. ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే తగిన చర్యలు ఉంటాయన్నారు. శనివారం ఆయన మాలకొండ వచ్చారు. స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయ పరిసరాలను పరిశీలించారు.అన్నదాన కార్యక్రమ నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించారు. నాణ్య తాప్రమాణాలను పలువురు భక్తులను ఆరా తీశారు.తదుపరి సహపంక్తి భోజన విస్తరణ కార్య క్రమాన్ని గురించి ఆల య అధికారి చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నా రు.అన్నదానంతోపాటు భక్తుల అభిప్రాయాలను ఉన్నతాధికా రులకు తెలియచేసే ప్రక్రియను ఆయన ఎమ్మెల్యేకి వివరించారు.తదుపరి ఆయన వీఐపీ గెస్ట్ రూములో అధికారులతో మాట్లాడారు.ఆలయ ప్రతిష్టకు భంగం కలిగితే తీవ్ర పరిణామాలుంటాయన్నారు.ఏ ఒక్కరిని ఉపేక్షించేది లేదన్నారు.ఇబ్బందిగా ఉన్నా, ఇష్టం లేకపోయినా స్వచ్ఛందంగా తప్పుకోవాలని ఆయన ఉద్యో గులకు సూచించారు.అంతేగానీ ఆలయంకు చెడ్డపేరు తెచ్చే చర్యలును ఉపేక్షించనన్నా రు.అన్నదాన నిర్వహణలో వస్తున్న ఆరోపణలు,అపోహలను తొలగించాలని ఆయన ఈవోకి సూచిం చారు.ఆలయ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఇందుకు తమ సహకారం పూర్తిగా ఉంటుందని ఈవోకి వివరించారు.అన్నదాననిర్వహణలో వస్తున్న ఆరోపణలు, అపోహలను తొల గించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు కె.ప్రసాద్, తెదేపా మండల అధ్యక్షు డు మాదాల లక్ష్మినరసింహంతోపాటు పలువురు ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆన్‌లైన్ ఆపరేటర్లపై డిఆర్‌ఓకు ఫిర్యాదు : దళిత సంఘ నాయకులు



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 28, ప్రభాతవార్త** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక తిక్కన ప్రాంగాణం ఆవరణంలో అర్జీ దారుల కోసం ఆన్లైన్ పద్ధతి పెట్టున్న సంగతి విధితమే. ఆన్లైన్ లో పనిచేసే ఆపరేటర్లు వివిధ డిపార్ట్మెంట్ నుండి వచ్చి పనిచేస్తున్నారు. గత సోమవారం ఒక ప్రజా సంఘ నాయకులు ఒక అర్జీ హెల్త్ డిపార్ట్మెంట్ సంబంధించి ఆరోగ్యరీత్యా న్యాయం చేయాలని అర్జీ దాఖలు చేయడానికి ,అర్జీ రాసుకొని ఆన్లైన్ చేర్చడానికి వెళ్తే అక్కడ కొంతమంది ఆపరేటర్లు సహాయక సిబ్బంది, అర్జీలో వచ్చిన కంప్లైంట్‌ను ముందుగానే ఫోటో తీసి బయట వ్యక్తులకు పంపిస్తున్నట్టు గమనించిన దళిత ప్రజా సంఘు నాయకులు కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ ఉదయభాస్కరరావుకు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు దళిత సంఘం నాయకులు తదితరుల పాల్గున్నారు.

## ఉద్యోగులకు, విద్యార్థులకు జాతీయ గణాంక దినోత్సవ శుభాకాంక్షలు

### - ఏపిజిఈఎ జిల్లా కార్యదర్శి రాంప్రసాద్



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 28, ప్రభాతవార్త** 19వ జాతీయ గణాంక దినోత్సవం ప్రజా పరిపాలనకు అత్యం త ఆవశ్యకమైన జనాభా లెక్కలు, వర్ష పాత వివరములు, పంటకోత ప్రయోగాలు వ్యవసాయ గణాంకాలు, పారిశ్రామిక గణాంకాలు, అభివృద్ధి సూచికలు, స్థూల ఉత్పత్తి అంచనాలు లాంటి పలు గణాంకాలను మదింపు చేయడమేగాక, స్వర్ణాంధ్ర 2047 ప్రణాళిక రచనతో రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యక్ష పరిపాలనలో ప్రధాన భూమిక వహిస్తున్న అర్ధ గణాంక శాఖ ఉద్యోగులకు నేటి 19వ జాతీయ దినోత్సవం సందర్భంగా ఏపిజిఈఎ జిల్లా కార్యదర్శి పివిఎస్‌టి రాంప్రసాద్ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కేవలం అర్థ గణాంక శాఖ ఉద్యోగులకే కాక, అన్ని ప్రభుత్వ శాఖలకు గణాంకాలు కీలకమని, రాష్ట్ర అభివృద్ధిలో శాఖల వాటా, అలాగే శాఖల పనితీరు సూచికల నిర్మాణం నుండి ఉద్యోగుల డిఏ పిఆర్‌సి ఫిట్మెంట్ వరకు నిర్ధారణ వరకు గణాంక శాస్త్రం సేవలు ఉపయోగపడుతున్నాయని ఆయన వివరించారు. ఇంకా జిల్లా వ్యాప్తంగా గణాంక శాస్త్ర అధ్యయన విద్యార్థులకు, అధ్యాపక సిబ్బందికి కూడా శుభాకాంక్షలు తెలియజేశారు. అంతర్జాతీయంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతకు గణాంక శాస్త్రం ఇంధనం లాంటిదని, నాటి గణనయంత్రం తయారీ నుండి, నేటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ యంత్రాంగం వరకు గణాంక శాస్త్రం లేదా డేటా సైన్స్ కీలకమని పేర్కొంటూ, గణాంక శాస్త్రం మీద పట్టు సాధించిన ఐటి విద్యార్థులే ఆధునిక ప్రపంచాన్ని దిశానిర్దేశం చేయనున్నారని పేర్కొన్నారు. కనుక ఐటికు అనుబంధంగా గణాంక శాస్త్రాన్ని కూడా శ్రద్ధగా అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు.

## రోడ్డెక్కిన పంచాయతీ కార్యదర్శులు

### - పంచాయతీ ఆఫీస్ ఎదురుగా బైఠాయించిన సెక్రెటరీలు కలెక్టరేట్ ఎదుట నిరసన






**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 28, ప్రభాతవార్త** శనివారం కార్యాలయం ఎదుట, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సెక్రె టరీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని పంచాయతీ సెక్రటరీలు పెద్ద ఎత్తున వచ్చి నిరసన వ్యక్తం చేశారు. తొలిత జిల్లా పరిషత్ కార్యాలయంలోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ఎదుట ధర్నాకూర్చుని తమ నిరసన వ్యక్తంచేశారు.తదుపరి కలెక్టర్ కార్యాలయం వద్దకు వచ్చి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ 20 24లో పంచాయతీరాజ్ కమిషనర్ వచ్చినప్పటి నుండి ఎన్నో చారిత్రత్మాక నిర్ణయాలు తీసుకొని దేశం లోనే ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖను గర్వించేలాగ పంచాయతీ కార్యదర్శులు పని చేశారని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించడం ద్వారా గిన్నిస్ రికార్డు ఈ మధ్య జరిగిన యోగాంధ్ర చేయడంలో కూడా మన రాష్ట్రం వరల్డ్ రికార్డు సృష్టించాం ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి పం చాయతీ కార్యదర్శిలుగా ఎన్నో రోజులు నుంచి పగలు, రాత్రి ఎంతో శ్రమ చేశారు. అని ఆంధ్ర ప్రదేశ్ లో గ్రామాలు దేశ వ్యాప్తంగా సరి పోల్చినప్పుడు పంచాయతీ కార్యదర్శులు కృషి, సేవల ద్వారా మెరుగైన అభివృద్ధివైపు దూసుకుపోతున్నాయి. కానీ రాష్ట్రంలో పంచాయితీ కార్యదర్శులుకు సొంత మడలం లో పోస్టింగ్ ఇవ్వడం లేదు. ఆధిక భాగం వారు నివాసానికి దూరంగా 50 నుండి 100 కెఎంలో విధులు నిర్వహిస్తున్నారు (అనారోగ్యం చికిత్స నిమిత్తం చిన్న పిల్లలు చదువులు, తల్లి దంధ్రులు సంక్షేమం వగైరా ) సదరు పంచాయితే కార్యదర్శులును దృష్టిలో ఉంచుకొని దిశిళి చేసిన వ్యాఖ్యలను ఉపశమహరించుకోవాలని కోర్యారు అలాగే. ఇటీవల కాలంలో గ్రామ పంచాయతీలో అన్నిరకాల సర్వేలు, స్వర్ణ పంచాయతీ పనులు, ఇంటి పన్నుల వసూళ్లు, పీ ఆర్ వన్ యాప్, గ్రామ సచివాలయ సర్వేలు, రెవెన్యూ వారి పిజిఆర్ఎస్ పనులు, గ్రామసభలు, జిపి సమావేశాలు, జి పీ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ఎన్నికల విధులు, ప్రోటోకాల్ విధులు, ఇలా చాలా రకాల పనులు పంచాయితీ కార్యదర్శులు మాత్రమే చేస్తున్నారని పంచాయతీ కార్యదర్శులు ప్రైమరీ డ్యూటీస్ శానిటేషన్, డ్రింకింగ్ వాటర్, స్ట్రీట్ లైట్ ఇవి అన్నియు సక్రమంగా సమర్థవంతంగా నిర్వహించి పని చేయుటకు స్టాఫ్సింగ్ పాట్రస్ తగిన వనరులు కావాలి ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శిలందరూ ఉద్యోగ నిర్వహణలో విపరీతమైన ఒత్తిడి పడుచు. మరి ముఖ్యముగా ఉదయం 06 గంటలనుండి పారిశుద్ధ్య పనులు తో మొదలుకొని గ్రామ వార్డు సచివాలయం వారి సర్వేలు మనమిత్ర, కేవైసీ, జియో ట్యాగింగ్, రైస్ కార్డ్స్, ప్రతిరోజు వెబ్ ఎక్స్ గూగుల్ మీటింగ్ లు, వీటితో పాటు అదనంగా అప్పటికప్పుడు వాట్సాప్ మెస్సెజ్ లు, స్ప్రెడ్ పీట్ వివిద యాప్స్ లో ఫోటో, వీడియో అప్డేట్ లు, వీటి నిమిత్తం ప్రజల మొబైల్ ఫోన్ నుండి ఓటిపి మెస్సేజ్ సేకరణ వంటి సమాచారం కొరకు ముందస్తు ప్రణాళిక లేకుండా వారు అనుకున్నపుడు అత్యవసరంగా ఆదేశించటం వలన తీవ్రమైన మానసిక వత్తిడికి గురై పంచాయతీ కార్యదర్శులు అకాల మరణం చెందుతున్నారని తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కర రావుకు వినతిపత్రం సమర్పించడం జరిగింది. అధ్యక్షులు శంకర్ సహాయక అధ్యక్షులు నారాయణ, రమేష్ అమర్నాథ్, జిల్లాలోని పంచాయతీ సెక్రెటరీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నెల్లూరు రూరల్‌లో వైసీపీ ఖాళీ

### - నెల్లూరు రూరల్ వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో భారీ చేరికలు

### - స్వాగతించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



నెల్లూరు రూరల్, జూన్ 28, ప్రభాతవార్త మాజీ కార్పొరేటర్ తురక అనిత, తురక సూరి ఆధ్వర్యంలో 30 వ డివిజన్ నుంచి దాదాపు 1000 మంది కార్యకర్తలతో భారీ ప్రదర్శనతో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం జనంతో కిటకిటలాడింది. మాజీ కార్పొరేటర్ తురక అనిత, తురక సూరి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సమక్షంలో తెలుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వారం రోజుల్లో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి రాజీనా మా చేసి, నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీలో భారీ చేరికలు ఉండబోతున్నాయి. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఏకధాటిగా అందరం కలసి నెల్లూరు రూరల్‌లో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేద్దాం. ఎక్కడికక్కడ స్థానిక ప్రజలకు అందుబాటులో ఉందాం. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులను సమన్వయం చేసుకొని,పూర్తిస్థాయిలోనూతన చేరికలు ప్రోత్స హిస్తాం. క్లస్టర్ ఇంచార్జి, కో క్లస్టర్ ఇంచార్జి, 30, 31 తెలుగుదేశం పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి వార్డుకు 10 లక్షలు కేటాయించాం

### - ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా






**బుచ్చి జూన్ 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయితీ సాధారణ సమావేశం ఛైర్‌పర్సన్ మోర్ల సుప్రజా అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో 10 అజెండాలు ఏకగ్రీవంగా ఆమోదం లభించింది. ఛైర్‌పర్సన్ కౌన్సిల్ సభ్యులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. బుచ్చి నగర పంచాయితీలో ప్రతి వార్డుకు 10 లక్షల రూపాయాలు అభివృద్ధి పనులకుమంజూరు అయినట్లు ఆమె తెలిపారు.పట్టణఅభివృద్దికి సహాయ సహకారాలు అందిస్తున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ,ఆమెప్రత్యేకంగా దన్యవాదాలు తెలిపారు .కొంత మంది కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు కమీషనర్ బాలకృష్ణా స మాధానం ఇచ్చారు. ఎట్టి కేలకు సాధా రణ సమా వేశం ప్రశాంతంగా ముగి సిం దని చెప్ప వచ్చు. ఈకార్యక్రమంలో కమీషనర్ బాలకృష్ణా,కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, నగర పంచాయితీ అధికారులు పాల్గొన్నారు.

## అనుమతుల మేరకే లేఅవుట్ల నిర్మాణాలను చేపట్టండి

### -కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్, జూన్ 28 ప్రభాత వార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో అనుమతుల మేరకే లే ఔట్ ల నిర్మాణాలను చేపట్టాలని, నూతన భవన నిర్మాణాలకు పట్టణ ప్రణాళిక విభాగం అనుమతులు తప్పనిసరి అని కమిషనర్ వై.ఓ నందన్ సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక 17 వ డివిజన్ గుండ్లపాలెం ప్రాంతంలోని లేఅవుట్ ను కమిషనర్ శనివారం సందర్శించారు. లేఔట్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేసి, లేఔట్ కు సంబంధించిన అన్ని అనుమతుల పత్రాలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలోని అన్ని నిర్మాణాలు అనుమతుల మేరకే నిర్మించుకునేలా పర్యవేక్షించాలని వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులను ఆదేశించారు. అనధికార కట్టడాలు, అనుమతులు అతిక్రమించిన భవనాలకు నోటీసులు జారీ చేసి ఛార్జ్ షీటులు దాఖలు చేయాలని సూచించారు. రోడ్లను ఆక్రమిస్తూ చేపడుతున్న నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకునేలా యజమానులు ముందుకు రావాలన్నారు. స్థానిక అపోలో హాస్పిటల్ రోడ్డు సమీపంలో పీపుల్స్ పార్కును కమిషనర్ సందర్శించారు. అనంతరం జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ శ్రీనివాసరెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ హిమబిందు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వి.ఆర్ పాఠశాల వ్యవస్థీకృత విధానంపై అవగాహన సదస్సు



**నెల్లూరు కార్పొరేషన్, జూన్ 28 ప్రభాతవార్త:** వి ఆర్ మున్సిపల్ పాఠశాల వ్యవస్థీకృత విధానంపై ఉపాధ్యాయులు, ప్రైమరీ, సెకండరీ తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకమైన సదస్సును నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ నిర్వహించారు. స్థానిక వి.ఆర్ మున్సిపల్ పాఠశాల ప్రాంగణంలో శనివారం జరిగిన ఈ అవగాహన సదస్సులో కమిషనర్ మాట్లాడుతూ పాఠశాల వ్యవస్థ విధి విధానాలు, నిర్వహణ తీరు, ప్రైమరీ తరగతి నుంచి విద్యార్థులకు అందజేయనున్న నాణ్యమైన విద్యా ప్రమాణాలు, తరగతి గదిలో అందించే ఉత్తమమైన శిక్షణ, విద్యార్థులకు వివిధ అంశాలపై ఉపాధ్యాయుల ద్వారా ఇవ్వనున్న తర్ఫీదు, ఆటపాటల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యానికై అందించే శిక్షణ, మైదానంలో గడపవలసిన క్రీడా సమయం, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ తదితర అంశాలపై అవగాహన కల్పించామని తెలిపారు. అదే విధంగా ప్రాంగణంలోని ఇతర ఖాళీగా ఉన్న తరగతి గదులను కూడా రీ మోడలింగ్ చేసి, పాఠశాలకు అనుసంధానించేలా ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.



## కమిషనర్ దృష్టికి సమస్యలు తీసుకెళ్ళిన కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ



**బుచ్చి జూన్ 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పం చాయితీలో పలు సమస్యల గురించి కౌన్సిలర్ బిట్ర గుంట ప్రమీలమ్మ కమిషనర్ బాలకృష్ణకు వినతి పత్రం సమర్పించారు. జనవరి 1 - 2025 జూన్ 25 ,2025 వరకు నగర పంచాయితీ జనరల్ ఫండ్ రూపంలో ఎంత జమ అయిందో తెలియజేయాలని ఆమె కోరారు. బెజవాడ గోపాల్‌రెడ్డి కాంప్లెక్స్,ఉక్కాల రాజేశ్వరమ్మ,బైనాహేమలత కాంప్లెక్స్,కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న షాపుల వేలం పాట వే యుట జరిగింది. దాని గాను ఎంత మొత్తం నగదు జమ అయిందో తెలియజేయాలని ఆమె కోరా రు.పారిశుద్ద్యంలో త్రాగునీటి సరఫరా నిమి త్తం 32 మంది సిబ్బంది ఉన్నారని అజెండాలో తెలియజేశారు. వారి పేర్లు తెలియజేయాలని ఆమె కోరారు. 22 మంది మోటార్ ఆపరేటర్లు ఉన్నారని తెలిపారు.వారి పూర్తి వివరాలు తెలియజేయాలని ఆమె కోరారు.

## వృద్దులకు ఇంటి దగ్గరే రేషన్ పంపిణీ



**కోవూరు, జూన్28 ప్రభాతవార్త :** మండలం లోని అన్ని రేషన్ షాపులకు సంబంధించి 65 సంవత్స రాల పైబడి ఉన్న వృద్ధులకు వారి ఇంటి దగ్గరే రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. ఈ మేరకు శని వారం ఆయన కోవూరులోని పలు రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 30 లోగా 60 సంవత్సరాలు పైబడిన వృద్ధు లకు సంబంధించిన రేషన్ పంపిణీ పూర్తి కావాలన్నారు. ఈ విషయంలో డీలర్లు నిర్లక్ష్యం చూపకుండా వారి ఇం టి వద్దకే వెళ్లి వాటిని సకాలంలో పంపిణీ చేసేలా తగు చొరవ తీసు కోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఇంటి దగ్గరే రేషన్ పంపిణీ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ నెల 26వ తేది నుంచి 30వ తేది లోగా వృద్ధులందరికీ ఇంటి దగ్గరే రేషన్ పంపిణీ చేసేలా చొరవ తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నా రు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాలయ ఉద్యోగుల పర్యవేక్షణలో 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ అందజేస్తున్నామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పద్ధతి కొనసా గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, డీలర్లు ఉన్నారు.

## మత సామరస్యాలకు ప్రతీక భారాషాహిద్ దర్గా

### - రొట్టెల పండుగకు వచ్చే భక్తులకు సకల సదుపాయాల కల్పన



**నెల్లూరు, జూన్ 28, ప్రభాతవార్త-విద్య :** మతసామరస్యాలకు ప్రతీకగా బారాషాహిద్ దర్గా నిలుస్తుందని జనసేనపార్టీ నాయకులు పేర్కొన్నారు. శనివారం నగరంలోని స్థానిక బరాషాహిద్ దర్గాలో రొట్టెల పండుగ ఏర్పాట్లను జనసేన నాయకులు నూనెమల్లిఖార్జునయాదవ్, ప్రధాన కార్యదర్శి గనుకుల కిషోర్,రాష్ట్ర నాయకులు సుందరరామిరెడ్డి, దర్గా నిర్వహణ కార్యదర్శి,జనసేన కార్యాలయ ఇన్‌చార్జ్ ఆజాద్ జమీర్‌లు పరిశీలించి దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతు ఎంతో ప్రాముఖ్యత కలిగిన రాష్ట్ర పండుగ రొట్టెల పండుతకు దేశ విదేశాల నుండి భక్తులు ప్రతి ఏటా విచ్చేసి రొట్టెలను పట్టుకోవటం జరుగుతుందన్నారు. ఇక్కడిని విచ్చేసే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా కూటమి ప్రభుత్వంఆ ధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. అలాగే తమ అధినేత, రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ సైతం ఈ ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నారన్నారు. గతంలో తమ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని రొట్టెలను పట్టుకున్నామని, ప్రస్తుతం ఆయన డిప్యూటీసిఎంగా సేవలు అందించటం తమ మనోభావాలకు ఊతమిస్తుందన్నారు. అలాగే రొట్టెల పండుగ నిర్వహణ కమిటీలో తమ పార్టీ నేతలకు స్థానం కల్పించటం సంతోషంగా ఉందని ఇందుకు కృషిచేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అందరూ కలిసి ఈ పండుగను విజయవంతం చేసేందుకు కృషిచేయ్యాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం కిషోర్‌బాబు, ప్రసాద్‌యాదవ్, కృష్ణారెడ్డి, నందిని, సుభాని, తదితరులు పాల్గొన్నారు.